క్లుప్తంగా

మల్లయ్య కొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 18,19 తేదీల్లో సర్వీసులు నడుస్తాయన్నారు. తంబళ్లపల్లె అన్నదానసత్రం నుంచి మల్లయ్య కొండపైకి 20 బస్సులు, మదనపల్లె-తంబళ్లపల్లె మల్లయ్యకొండ కిందకి 15 బస్సులు, తంబళ్లపల్లె బస్టాండు నుంచి మల్లయ్యకొండ కిందకి 5 బస్సులు, నడుపుతామన్నారు. పెద్దమండ్యం-మల్లయ్యకొండ కిందకు 5 బస్సులు, బి.కొత్తకోట-మల్లయ్యకొండ కిందకి రెండు బస్సులు, ములకలచెరువు-మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, అంగళ్లు నుంచి చిన్న మల్లయ్యకొండకు 8 బస్సులు నడుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

ప్రతిభ విద్యార్థికి అభినందనలు

రామసముద్రం: మండలంలోని చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్‌కుమార్‌రాజు అండర్ 14 వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించినందకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణుప్రియ శుక్రవారం స్థానిక పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పవన్‌కుమార్‌రాజు మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు , కుటుంబ సభ్యులు , విద్యార్థులు , గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఆంజనేయ స్వామి తిరునాల

వాల్మీకిపురం: మండలంలోని పాతమంచూరు గ్రామంలోని బాహుదానది ఒడ్డున వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో రెండు రోజుల పాటు తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి రామక్రిష్ణ తెలిపారు. శనివారం ఉదయం శివకోటి మహా యజ్ఞం, అక్క దేవతల పచ్చ, రాత్రి శివపార్వతుల కల్యాణం, అగ్నిగుండ ప్రవేశం, ఆదివారం సీతారామ, లక్ష్మణ, హనుమంతులను పుష్పపల్లకీలో ఊరేగింపు, శ్రీరామ సంకీర్తనలు, చెక్కభజనలు, ఉట్ల తిరునాల, స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీలో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సావాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త యల్లప్ప తెలిపారు. ఉదయం 10గంటల నుంచి అన్నదానం, ప్రత్యేక పూజలు, సాయంత్రం 6గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలం కోటకొండ దిగువ తండా పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. సీఐ కథనం మేరకు కోటకొండ దిగువ తండా సమీపంలో నాటు సారా వండుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

కలకడ : మండలంలో 10 లీటర్లు సారా సీజ్ చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలాఉన్నాయి. శుక్రవారం ముందస్తు సమాచారంతో నడిమిచెర్ల పంచాయతీలో దాడులు నిర్వహించగా గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ కిలారివాండ్లపల్లెకు చెందిన చంద్రప్ప కుమారుడు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న సారాసీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శివుని రాతి విగ్రహం వితరణ



పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయానికి ఓ భక్తుడు శివుని రాతి విగ్రహాన్ని బహూకరించినట్లు ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. బి.కొత్తకోటకు చెందిన ఆకుల మల్లికార్జున అనే భక్తుడు రూ.45 వేల విలువ చేసే రాతి విగ్రహాన్ని అందజేసారన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో జరిగే వివిధ పూజలు, అభిషేకాల్లో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహాశివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

- శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ




మదనపల్లె సిటీ: సోమేశ్వరస్వామి ఆలయంలో బ్రహోత్సవాల అంకురార్పణకు పూజలు, రామసముద్రం : విద్యుత్ దీపాలంకరణలో శివపార్వతులు

శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించారు. గణపతి పూజ, స్వస్తి వాచన, కలశస్థాపన, నాందీ, ఋత్విగ్వరణం, మండల పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామిని నందివాహనంపై ఊరేగించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ, లక్ష్మణస్వామిలు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని యోగభోగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శివరాత్రికి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ రమణ పర్యవేక్షించారు.

ముస్తాబైన శివాలయాలు

శివరాత్రికి మదనపల్లె, మదనపల్లె మండల పరిధిలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయం, టీ.ఎన్.క్రిష్టారెడ్డివీధిలోని పంచాలింగాల శివాలయం, శివనగర్‌లోని శిద్దలింగేశ్వరస్వామి ఆలయం, చౌడేశ్వరినగర్‌లోని జలకంఠ శివాలయం, బసినికొండలోని శివాలయాలు శివరాత్రికి ముస్తాబు చేశారు. మదనపల్లె మండలం సీటీఎం లోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, గెవిగుండులోని గవి గంగాధరస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాలు శివరాత్రికి ప్రత్యేకంగా అలంకరించారు.

కొండకోనల్లో వెలసిన సిద్దేశ్వరుడు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండ పట్టణ పరిసరాల్లోని కొండ కోనల నడుమ శ్రీసిద్దేశ్వడు వెలిశాడు. చాళుక్యులు,శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన పురాతన ఆలయాలకు విశిష్ట చరిత్ర ఉంది. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. గుర్రంకొండ కోటకు తూర్పువైపున ముచ్చుకోనలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన పురాతన శ్రీరుద్ర నాగలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇక్కడ సహజ సిద్ధమైన కోనేరు ఉంది. అందులో నంది నోట్లో నుంచి ఎప్పుడు జలధార కారుతూ ఉండడం ఇక్కడి విశేషం. ఎంతటి కరువుకాలమైన ఇక్కడి కోనేట్లో నీరు ఉంటుంది. సిద్దేశ్వర గుట్టలోని ఓ గుహలో సహజ సిద్ధంగా శ్రీసిద్ధలింగేశ్వర స్వామి వెలిశాడు. గుహలోనే శివలింగం, నంది ఉన్నారు. నిత్యం అడివి జంతులు సంచరించే ఈ గుహలో ఆలయం ఉండడం విశేషం. దీంతో ఈ ఆలయాల్లో పండుగ ఉత్సవాలు నిర్వహించదానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబు

రామసముద్రం: మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం జరిగే మహాశివరాత్రి వేడుకలకు ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం సమీపంలో కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఇప్పటికే ప్రారంభమైయ్యాయి. అలాగే గుంతయంబాడిలోని శ్రీపుండీశ్వరస్వామి, మూగవాడిలో వెలసిన శ్రీవాలీశ్వరస్వామి, చంద్రశేఖరస్వామి, చెంబకూరులోని లోకనాథస్వామి ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మారుమ్రోగిన శివనామస్మరణ

తంబళ్లపల్లె: భక్తులతో శివనామస్మరణతో మల్లయ్యకొండ మారుమ్రోగింది. శివమాల ధరించిన భక్తులు శుక్రవారం స్వామివారికి ఇరుముడితో మల్లయ్యకొండకు చేరుకున్నారు. స్వామివారికి ఇరుముడి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి తలనీలాలు సమర్పించి భగీరథ కోనేటిలో పుణ్యస్నానం ఆచరించి రాత్రంతా భజనలు, శివనామస్మరణతో జాగరణ చేశారు. పూజారి ఈశ్వరప్ప స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి, ఈవో రమణల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి, అన్నసంతర్పణ చేశారు.

కురబలకోట: శివరాత్రి వేడుకలకు అంగళ్లు మల్లయ్యకొండపై సర్వం సిద్ధం చేశారు. తొలి సారిగా తహసీల్దారు, ఎంపీడీఓలు ప్రజా ప్రతినిధులతో సహా ఉద్యోగులు కూడా భాగస్వామ్యులవుతున్నారు. అధికారుల నియంత్రణలో ఈ ఉత్సవాలు జరుగుతుండడం విశేషం. కొండపై ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కొండపై భక్తులు, సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జెడ్పీటీసీ బైసాని జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, తహసీల్దారు ఎం. భీమేశ్వర రావు తెలిపారు. శుక్రవారం కూడా కొండపై ఏర్పాట్లు పరిలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా ఉత్సవాలు నిర్వహించి మండలానికి మంచి పేరు తీసుకు రావాలని తహసీల్దారు సూచించారు. శనివారం సాయంత్రం మౌనిక, హర్షిత నాయుడుచే భరత నాట్యం, కూచి పూడి నాట్యంకు ఏర్పాట్లు చేశారు. అనంతరం కళ్యానోత్సవం ,రథోత్సవం, చాందినీ బండ్లు మెరువన కొనసాగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి తెలిపారు.

రేపు బీటీ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశం

మదనపల్లె : మదనపల్లె బిసెంట్ థియోసఫికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గంగారపు రాందాస్‌చౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బెంగళూరురోడ్డులోని టీఎస్.అభిరామిరెడ్డి తోటలో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి పెద్దసంఖ్యలో బీటీ కళాశాల పూర్వవిద్యార్థులు హాజరు కావాలని కోరారు. బీటీ కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. పలు సేవాకార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన

గుర్రంకొండ: మండల పరిధిలో ఉన్న తరిగొండలోని డంపింగ్‌యార్డును ఎంపీడీఓ వెంకటేశులు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుల్లో వర్మికంపోస్టు ఎరువులు తయారీ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని అన్ని డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ముఖ్యంగా డంపింగ్‌యార్డుల్లో వానపాముల పెంపకం చేపట్టి తద్వారా వర్మికంపోస్టు ఎరువుల తయారీకి శ్రీ కారం చుట్టాలన్నారు. తద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులు సృష్టించుకోవచ్చన్నారు. డంపింగ్ యార్డుల్లో పెండింగ్‌లో ఉన్నపనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మణికుమార్, కల్యాణి,ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ సేవలను విస్తృతం చేయాలి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయ్యూబ్ హుసేన్‌తో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ముస్లిం మైనార్టీలు, ఉర్దూ విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యధికంగా ఉన్న అన్నమయ్య జిల్లాలో ఉర్దూ అకాడమీ సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయ్యూబ్ హుసేన్ వాల్మీకిపురంలో పర్యటించి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ముస్లిం మైనార్టీలు ఇప్పటికీ సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. పేదరికంతో అలమటిస్తున్నారు. మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నప్పటికీ దారిద్రరేఖకు దిగువనే ఉండడం విచారకరమన్నారు. మైనార్టీలు విద్యాపరంగా అభివృద్ధిని సాధించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన భవన వసతిని కల్పిస్తామన్నారు. పీలేరు నియోజకవర్గంలో 35వేల మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని, వీరందరూ ఉర్దూను చదివే వారేనని తెలిపారు. కలికిరి, గుర్రంకొండ మండలాల్లో హిందువులు కూడా ఉర్దూ చదవడం, రాయడం గమనార్హమన్నారు. ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయ్యూబ్ హుసేన్ మాట్లాడుతూ పీలేరులో ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందుకు రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహ్మద్ కూడా సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం అయ్యూబ్ హుసేన్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీమ్, కలికిరి మండల కోఆప్షన్ సభ్యులు రిజ్వానుల్లా, చికెన్‌మస్తాన్, సైఫుల్లా, గంగయ్య, సద్దాం, ఉర్దూ అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ గ్రంథాలయానికి వసతులు కల్పిస్తాం

గుర్రంకొండ: పట్టణంలోని ఉర్దూ గ్రంథాలయానికి అవసరమైన అన్ని వసతులు కలిప్పిస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయూబ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఉర్దూ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా అక్కడి వసతులపై ఆరా తీశారు. గ్రంథాలయానికి ఒక కంప్యూటర్, కొన్ని ఉర్దూ పుస్తకాలు మంజూరు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. అనంతరం స్థానిక ఉర్దూ జెడ్పీహైస్కూల్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ మహమ్మదాలీ, లైబ్రేరియన్ కుసుమ, ఎంపీటీసీ ఖదీర్, పాఠశాల కమిటీ చైర్మన్ సైదుల్లా, గ్రంథాలయ కమిటీ సభ్యులు హిదయతుల్లాహుస్సేనీ పాల్గొన్నారు.

స్మశానానికి దారి సౌకర్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి పంచాయతీ కొత్తపల్లిలో స్మశానానికి దారి సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ సుబ్బిరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. గడప, గడపకూ మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా దారి సౌకర్యం కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జేసీబీతో భూమిని చదును చేయించి ప్రైవేటు భూముల రైతుల సహకారంతో దారి సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

గుర్రంకొండ: రబీసీజన్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈక్రాప్ చేయాల్సిందేనని ఏడీఏ వాణిశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. అక్కడ జరిగిన ఈక్రాప్ నమోదును ఆన్‌లైన్‌లో తనిఖీ చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తాము సాగు చేసుకొన్న పంటలను ఆర్బీకే సిబ్బంది వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈక్రాప్ చేసుకొంటే పంట నష్టపరిహారం, బ్యాంకుల్లో రుణాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటరమణ, ఎంపీఈఓ రిజ్వానా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కదేవతలకు పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లెలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి సహకారంతో నిర్మించిన అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం గ్రామంలో అక్కదేవతల విగ్రహాలను, గుర్రాలను మంగళవాయిద్యాలు, పిల్లనగ్రోవి, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా ఊరేగించారు.

మయూర వాహనంపై సిద్దేశ్వరుడు



కలకడ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి వారిని మయూర వాహనంపై ఊరేగించారు. గురువారం రాత్రి అలంకరించిన చాందినీబండిపై స్వామివారిని రంగురంగుల విద్యుత్ దీపాలతో కలకడ పురవీధులలో ఊరేగించి, ఇంటింటి పూజలు అందుకున్నారు. చాందినీ బండి ముందు ఏర్పాటు చేసిన కోలాటం,పిల్లనగ్రోవి, చక్కభజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామివారు శుక్రవారం ఆలయ ప్రవేశం చేయగానే తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేల మల్లేశ్వరస్వామికి వెండి రుద్రాక్షమాల



వెండి రుద్రాక్షమాలను బహూకరిస్తున్న జెడ్పీటీసీ ప్రమీలమ్మ, రమణారెడ్డి దంపతులు

నిమ్మనపల్లె : మండలంలోని ప్రసిద్ధ శివాలయమైన శ్రీ యోగనేలమల్లేశ్వరస్వామికి జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమీలమ్మ, రమణారెడ్డి దంపతులు వెండి రుద్రాక్షమాలను బహూకరించారు. శుక్రవారం నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.22వేల రూపాయల విలువచేసే 500 గ్రాముల వెండితో 108 వెండి తొడుగుల రుద్రాక్షలతో కూడిన మాలను స్వామివారికి తమ కానుకగా పూజారి శంకరశర్మకు ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలి

– జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్



కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకుంటున్న విశ్వనాథ్

పీలేరు : మహాశివరాత్రి ఉత్సవాలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అలాగే రుద్రహోమం, గణపతి హోమం, నవగ్రహ హోమం, దుర్గా హోమం నిర్వహించారు. అనంతరం రుద్ర పారాయణము నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కుటుంబ సంక్షేమ ప్రధాన గణాంకాధికారి ఓబుల్‌రెడ్డి

పీలేరు రూరల్ : ప్రభుత్వాస్పత్రి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కుటుంబ సంక్షేమ ప్రధాన గణాంకాధికారి ఓబుల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పీలేరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సేవలకు సంబంధించి సరైన సమయంలో రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలో జనన, మరణాలు, ఓపీ, శస్త్రచికిత్స వివరాలు, వ్యాధుల నిర్ధారణకు నమోదు కాబడ్డ రోగుల వివరాలు, గర్భవతులకు, ప్రసవ సేవలు, రెఫరల్ సేవలు, కుటుంబ నియంత్రణ శాశ్విత, తాత్కాలిక సేవలు ఎప్పటికప్పుడు నమోదుచేయాలని ఆదేశించారు. వ్యాధినిరోధక టీకాల సేవలు, హెచ్ఎంఐసీ సేవల నమోదు తప్పని సరన్నారు. రికార్డుల నమోదులో లోటుపాట్లు, సవరణలపై సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ నాగవేణి, డీఎస్‌వో కరీముల్లా, ఏఎస్‌వో శివారెడ్డి, ఎంపీహెచ్ఈవో ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

‘ఈ-అన్నదాత’తో రైతులకు ప్రయోజనం

పెద్దతిప్పసముద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-అన్నదాత పథకం దేశంలోని అన్ని వర్గాల రైతులందరికీ ఎంతో ప్రయోజనకరమని ఆ పథకం మండల ఇన్‌చార్జి డీ.మహేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలోని రూ.13.5 కోట్ల మంది రైతుల సౌకర్యార్థం 2021 నవంబర్ 23 నుంచి ఈ-అన్నదాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. రైతులు వారి పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులతో పాటు రూ.150ల నగదును చెల్లిస్తే ఆయా రైతుల వివరాలను కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఈ-అన్నదాత కార్డును అందజేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించిన రైతులు ప్రమాదవశాత్తు, రోడ్డు ప్రమాదంలో మృతి చెందినా, గాయపడి వికలాంగులైనా వారి కుటుంబ సభ్యులకు రూ.2 నుంచి రూ.25 లక్షల వరకు ప్రమాద బీమా లభిస్తుందన్నారు. మండలంలో సుమారు 13 వేల మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 1,205 మంది రైతులు ఈ పథకంలో రిజిస్ట్రేషన్ చేసుకుని కార్డులు పొందారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఈ పథకం అమలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆర్థిక పొదుపుతో ఉజ్వల భవిత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రావణి

కేవీపల్లె : ఆర్థికంగా పొదుపు చేయడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండలంలోని వగ్లల్ల కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. శ్రావణి అన్నారు. శుక్రవారం విద్యార్థులకు ఆర్థిక పొదుపు, సామాజిక భద్రత అంశంపై ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక పొదుపు, బీమా, ఆన్‌లైన్ చెల్లింపులు, కుటుంబ ఆదాయ, వ్యయాలు, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. సుకన్య సంవృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో, పోస్టాఫీసులలో నగదు పొదుపు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుధాకర్, శివ, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్మవారికి కాంస్య సింహాసనం వితరణ

కలికిరి: పట్టణంలో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మకు నవదుర్గాల ప్రభావళితో కూడిన సింహాసనాన్ని దాతలు వితరణ చేశారు. కె.రెడ్డివారిపల్లికి చెందిన నాగిరెడ్డిగారి నాగిరెడ్డి, శ్రీదేవమ్మ దంపతులు రూ.లక్షకు పైగా విలువ చేసే సింహాసనాన్ని శుక్రవారం ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్ కుమార్ రెడ్డికి అందజేశారు. అనంతరం సింహాసనంపై అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దాతలు పాల్గొన్నారు. అర్చకులు దాత దంపతులను ఆశీర్వదించారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి



విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

వాల్మీకిపురం: విద్యార్థులందరూ ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిజిటల్ క్లాస్ రూములు, కంప్యూటర్ ల్యాబ్‌లు, జేకేసీ ల్యాబ్, జిమ్నాషియం, క్రీడా మైదానం, వీటితో పాటు అత్యంత అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో విద్యా భోదన అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ విద్యతోపాటు నైపుణ్యాలు, ఉద్యోగ నైపుణ్యాలు నేర్పిస్తారని, జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షులు రాఘవ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెద్దతిప్పసముద్రం: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మూడు గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవిస్తున్నారు. మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీ అంగడివారిపల్లి, సంపతికోట పంచాయతి ముంతపోగులవారిపల్లి, కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లిలో సుమారు 20 రోజుల నుంచి తాగునీటి ఎద్దడి నెలకొంది. అధికారులు, పాలకులు పట్టించుకున్నా పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లలో నీళ్ళు పుష్కలంగా ఉన్నా, మోటారు మరమ్మతులు, అదనపు పైపులను బోర్లలోకి అమర్చితే నీటి సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల నడుమ సమన్వయం లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని సమాచారం. కనీసం ఇప్పటికైనా ప్రజల కనీస అవసరాలను దృష్టిలో ఉంచుకుని మండల స్థాయి అధికారులు ప్రత్యేక చొరవతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రామసముద్రం: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి భార్గవి తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గుంతయంబాడి గ్రామంలో 104 వైద్యసేవలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలను గుర్తించి వైద్యసేవలు అందించి, సలహాలు, సూచనలు అందజేశారు. బీసీ, షుగర్ పరీక్షలు చేశారు.